దీపం.. దేదీప్యం

దీపావళి పండుగను ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. మహిళలు భక్తిశ్రద్ధలతో నోములు నోచుకున్నారు. శాస్త్రోక్తంగా కేదారగౌరీదేవి వ్రతం ఆచరించారు. ఆదిలక్ష్మీ దేవిని ఆరాధించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇంటింటా ప్రమిదల్లో దీపాలు వెలిగించారు. పిల్లల.. పెద్దలు తేడా లేకుండా బాణసంచా పేలుస్తూ సంబరాలు చేసుకున్నారు. పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలకు భక్తులు పోటెత్తారు.

- శోభాయమానంగా దీపావళి వేడుకలు
- భక్తిశ్రద్ధలతో నోములు
- ఉత్సాహంగా టపాకాయలు పేల్చిన పిల్లలు.. పెద్దలు

సూళ్లూరుపేట : పట్టణంలోని శ్రీ నాగేశ్వరస్వామి, శ్రీమద్వేంకట రామమూర్తులవారి ఆలయాల్లో దీపావళి పండుగ సందర్భంగా సోమవారం కేదారేశ్వర వ్రతం (దీపావళి నోములు) నిర్వహించారు. ముఖ్యంగా నాగేశ్వరస్వామి ఆలయంలోని వాకాటి నారాయణరెడ్డి–గీత కల్యాణమండపంలో పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలకు ప్రత్యేక అలంకారం చేశారు. ప్రధాన అర్చకులు సునీల్‌స్వామి పూజలు చేశారు. పెద్దసంఖ్యలో మహిళలు హాజరై ఆదిదంపతులను పూజించుకుని నోములు నోచుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ స్వామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. అలాగే మద్వేంకట రామమూర్తుల ఆలయంలో కూడా ప్రత్యేకంగా స్వామివారిని ప్రతిష్ఠించి కేదారేశ్వరస్వామి వ్రతం నిర్వహించారు.


సైదాపురంలో బాణసంచా కాల్చుతున్న దృశ్యం


సూళ్లూరుపేట: రామమూర్తుల స్వామి ఆలయంలో వ్రతం ఆచరిస్తున్న భక్తులు

సైదాపురంలో..

సైదాపురం : మండలంలోని ఆదివారం ఘనంగా దీపావళి పండుగ జరుపుకున్నారు. ఇళ్ల వద్ద దీపాలు వెలిగించి బాణాసంచా కాల్చారు.

పెళ్లకూరులో..

పెళ్లకూరు : మండలంలో ఘనంగా దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ప్రశాంత వాతావరణలో పండుగ నిర్వహించుకునేలా పోలీసులు అవగాహన కల్పించారు.

నాయుడుపేటలో..


నాయుడుపేటటౌన్ : పట్టణంలోని పిళ్లారిగుడి, శివాలయం, రాజగోపాలపురంలోని రామాంజనేయ ఆలయం, మూకాంబిక గుడి, వాసవీ కన్యకాపరమేశ్వరి, రామాలయం, మహాలక్ష్మమ్మ ఆలయం, అంకాళమ్మ ఆలయం, శ్రీకృష్ణ మందిరం, దుర్గామల్లేశ్వరి దేవి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో అమ్మవారి కలశాలు ఏర్పాటు చేసి నోములు జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గూడూరులో..

గూడూరురూరల్ : పట్టణం, మండలంలో ఆదివారం వైభవంగా దీపావళి వేడుకలు నిర్వహించారు. బంధుమిత్రులకు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బాణ సంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మ, పారిశ్రామికవేత్త పానకా శివకుమార్‌రెడ్డి నివాసంలో భారీగా వేడుకలు నిర్వహించారు. మార్వాడీలు తమ దుకాణాల్లో లక్ష్మీదేవికి పూజలు నిర్వహించి టపాకాయలు కాల్చారు. బజారు వీధిలో వెలసియున్న శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో దీపావళి పండుగ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు.

సాయి సత్సంగ నిలయంలో ..

పట్టణంలోని పటేల్ వీధిలో ఉన్న శ్రీసాయి సత్సంగ నిలయంలో దీపావళి పండుగను పురస్కరించుకుని ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. శ్రీమహాలక్ష్మి అమ్మవారికి నాణెములతో విశేష పూజ చేశారు. అనంతరం శ్రీ విజయ దుర్గ అమ్మవారికి నక్షత్ర, నవగ్రహ పూర్వక అధిదేవత, ప్రత్యేక దేవత సహిత మహా హోమం నిర్వహించారు. అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారికి దీపావళి పూజ జరిపించారు. అమ్మవారిని అర్చించిన నాణేలాలను సాయి సత్సంగ నిలయం నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ప్రసాదంగా అందజేశారు.


సాయి సత్సంగ నిలయంలో శ్రీమహాలక్ష్మికి విశేష పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

చిట్టమూరులో..

చిట్టమూరు : మండలంలో ఆదివారం దీపావళి పర్వదినాన్ని ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు.ఆలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

వెంకటగిరిలో..

వెంకటగిరిరూరల్ : పట్టణం, రూరల్ ప్రాంతాల్లో దీపావళి సంబరాలను వైభవంగా నిర్వహించారు.


సూళ్లూరుపేట : నాగేశ్వరాలయంలో కేదార వత్రం ఆచరిస్తున్న భక్తులు


నాయుడుపేటలో నిర్వహించిన సామూహిక వ్రత పూజల్లో మహిళలు


గూడూరు : దీపావళి పండుగను జరుపుకుంటున్న స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ పానకా దేవసేనమ్మ దంపతులు


గూడూరు పట్టణంలో బాణా సంచా కాలుస్తూ పండుగ జరుపుకుంటున్న దృశ్యం

క్లుప్తంగా

వైభవంగా సిద్ధులయ్య తిరునాళ్ల


స్వామివారికి పూజ చేస్తున్న అర్చకులు

సైదాపురం : మండలంలోని సిద్ధులయ్య కోనలో సోమవారం వైభవంగా తిరునాళ్ల నిర్వహించారు. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి దీపారాధనలు చేశారు. కోన ఆలయంలో శివపార్వతులకు ప్రత్యేక పూజలు జరిపించారు. ఆదిదంపతులను శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీనవకోటి, నవనాథుల సిద్ధులయ్యతో పాటు వారి ప్రియ శిష్యులైన సారంగధరుడుకు పాలాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వాముల వారికి నవగ్రహదోష, కాలసర్ప, రాహుకేతు దోష నివారణ పూజలు చేశారు. పోలీసులు బందోబస్తు కల్పించారు.

40 మంది రక్తదానం

చిట్టమూరు : మండలంలోని రాఘవవారిపాళెంలో సోమవారం నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది రక్తదానం చేసినట్లు ఆర్జీపీ యువసేన సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. నెల్లూరుకు చెందిన నోవా బ్లడ్ బ్యాంక్ సిబ్బంది దాతల నుంచి రక్తం సేకరించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సాయిసేవా సమితి అధ్యక్షుడు దర్శి వెంకటరమణయ్య, ఆర్జీపీ యువసేన సేవా సంస్థ అధ్యక్షుడు అమాస అరుణ్‌కుమార్, కార్యదర్శులు మనోహర్, మునికుమార్, సభ్యులు వెంకటేష్, కిరణ్, రాము, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

దివ్యాంగులకు దుస్తుల పంపిణీ

గూడూరురూరల్ : రిహాబిలిటేషన్ అండ్ ఎడ్యుకేషన్ ఫర్ డిసేబుల్డ్ (రెడ్) సంస్థ వారు పట్టణంలోని శ్రీకల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం 40 మంది దివ్యాంగులకు నూతన వస్త్రాలు, టపాకాయలు, స్వీట్లు పంపిణీ చేశారు. మాజీ ఏపీపీ వసంత్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అలాగే మారుబోయిన చిరంజీవిగౌడ్ జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రావం అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాది చంద్రశేఖర్, బిల్డర్ జిల్లా చంద్రశేఖర్, రెడ్ సంస్థ అధ్యక్షుడు జానా సుధీర్, సభ్యులు శ్రీధర్, రాజేష్, శ్రీనివాస ఆచారి, వెంకటేశ్వర్లు, షేక్ జమీర్ పాల్గొన్నారు.

తిరుపతి ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా కమలాకర్‌రెడ్డి


కమలాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న సుబ్బారెడ్డి

నాయుడుపేటటౌన్ : రేణిగుంటలోని తిరుపతి ఎయిర్‌పోర్టు అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా మేనకూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ నేత కట్టా కమలాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం ఆయనకు పార్టీ నేత దువ్వూరు సుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు. గజమాలతో ఘనంగా సత్కరించారు. కమలాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కట్టా సుధాకర్‌రెడ్డి సహకారంతో రెండో పర్యాయం విమానాశ్రయ అడ్వైజరీ కమిటీ సభ్యుడిగా అవకాశం వచ్చిందని తెలిపారు.

కుక్కల దాడిలో జింకకు గాయాలు

దొరవారిసత్రం : మండలంలోని ముచ్చలగుంట గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో ఓ జింక గాయపడింది. గ్రామస్తుల సమాచారం మేరకు నేలపట్టు పక్షుల కేంద్రం అటవీ సిబ్బంది గ్రామానికి చేరుకుని జింకకు వైద్యం అందించారు. అనంతరం పక్షుల కేంద్రంలోని జింకల పార్కుకు తరలించారు.

తమ్మినపట్నంలో కబడ్డీ పోటీలు

చిల్లకూరు : చిల్లకూరు, కోట, వాకాడు మండలాల్లో ని క్రీడా కారులను ప్రోత్సహించేందుకే జిందాల్ మెమోరియల్ కబడ్డీ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు జిందాల్ పవర్ (సింహపురి) ప్రాజెక్టు ప్రతినిధులు సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ స్పోర్ట్ అథారిటీ సహకారంతో ఈ నెల 25, 26వ తేదీల్లో తమ్మినపట్నంలో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఆసక్తిగల జట్లు ఈ నెల 17వ తేదీ లోపు పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. వివరాలకు 8712695196, 8712695183 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కత్తితో దాడి

దొరవారిసత్రం: పాత కక్షల కారణంగా ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన వీఎంఆర్ నగర్ వద్ద ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం.. వేటగిరి పాళెం గ్రామానికి చెందిన పాలూరు ప్రసాద్ వీఎంఆర్ నగర్‌లో ఉన్న ఓ దుకాణం వద్ద ఫ్రైడ్‌రైస్ ఆడర్ చేసి అక్కడే ఉన్నాడు. అదే సమయంలో వేటగిరిపాళెం గ్రామానికి చెందిన పాలూరు బాలాజీ, ఆలత్తూరు దశరథతో బైక్‌పై దుకాణం వద్దకి వచ్చి ప్రసాద్‌పై కత్తితో దాడిచేసి పరారయ్యాడు. బాలాజీ, ప్రసాద్ కుటుంబాల మధ్య గత కొన్నేళ్లుగా వివాదాలు ఉన్నాయి. పాత కక్షల కారణంగానే బాలాజీ పథకం ప్రకారం ప్రసాద్‌పై కత్తితో దాడి చేసినట్టు తెలుస్తోంది. గాయపడిన ప్రసాద్‌ను మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్టు ఎస్‌ఐ తిరుమలరావు తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి చేయూత

సాక్షి ఎఫెక్ట్..

గూడూరురూరల్ : మండలంలోని విందూరు గిరిజన కాలనీకి చెందిన క్యాన్సర్ బాధితురాలు పావనికి పట్టణంలోని ప్రగతి సేవా సంస్థ సభ్యులు చేయూతనందించారు. ఈ నెల 9వ తేదీన సాక్షి పత్రికలో ×ఊపిరి పోయండి× శీర్షికతో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. మంచానికే పరిమితమై దయనీయ స్థితిలో ఉన్న బాధితురాలికి సంస్థ సభ్యులు విద్యుత్‌శాఖ విశ్రాంత ఉద్యోగి వర్మ రూ.5వేలు అందించారు. ఐటీఐ ప్రభాకర్ రూ.5వేల విలువైన నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వరప్రసాద్ రూ.3వేల విలువైన నూతన వస్త్రాలను అందజేశారు. ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ బాధితురాలి ప్రాణం కాపాడేందుకు తమ వంతు సహకారం అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు బండి ధనుంజయరెడ్డి, అబ్దుల్లా, అరుణ్‌కుమార్, అంగన్‌వాడీ కార్యకర్త కోటేశ్వరి, సంస్థ సభ్యులు వాకాటి రామ్మోహన్‌రావు, ప్రజేంద్రరెడ్డి, శ్రీచైతన్య ప్రిన్సిపల్ శ్రీనివాసులు, శివకుమార్‌రెడ్డి, రాధయ్య, ప్రభాకర్, కుమార్ నాయుడు, సతీష్ పాల్గొన్నారు.


బాధితురాలి కుటుంబీకులకు ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

అనుమానితులతో అప్రమత్తం

నాయుడుపేటటౌన్ : అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులతో ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఐలు నరసింహారావు, వైవీ సోమయ్య వేర్వేరుగా హెచ్చరించారు. చెడ్డీ గ్యాంగ్ తిరుగుతున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు ముందస్తు జాగ్రత్తలు చేపట్టినట్లు వెల్లడించారు. ఎస్‌ఐలు వేణు, కృష్ణయ్య ప్రత్యేక సిబ్బందితో గస్తీ ఏర్పాటు చేసినట్లు వివరించారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వ్యక్తులు దుస్తులు అమ్ముతూ అనుమానస్పదంగా సంచరిస్తున్నట్లు స్థానికులు సమాచారం అందించడంతో సదరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామన్నారు. నాయుడు పేట రూరల్ సర్కిల్ సంబంధించి ఓజిలి, దొరవారిసత్రం, పెళ్లకూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎస్‌ఐలు ఆదిలక్ష్మి, ,తిరుమలరావు, శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిఘా పెట్టి నట్లు సీఐ వైవీ సోమయ్య వెల్లడించారు. ఎవరైనా అనుమాస్పదంగా కనిపిస్తే వెంటనే 100, 9440796356, 9440796357 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.


అనుమానితుడిని విచారిస్తున్న పోలీసులు

నేటి నుంచి స్కంధ షష్టి బ్రహ్మోత్సవాలు

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో ఉన్న శ్రీవళ్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యేశ్వర స్వామివారి ఆలయంలో మంగళవారం నుంచి స్కంధ షష్టి బ్రహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు చదలవాడ మోహన్‌కృష్ణ శర్మ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 19వ తేదీ వరకు కొనసాగనున్న ఉత్సవాల్లో నిత్య పూజలను శోభాయమానంగా జరిపించనున్నట్లు వెల్లడించారు. ప్రతి రోజూ స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేయడంతోపాటు రాత్రి నగరోత్సవం నిర్వహించనున్నట్లు వివరించారు. 18 తేదీ రాత్రి పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద తారకాసుర సంహార ఘట్టాన్ని శాస్త్రోక్తంగా జరిపించనున్నట్లు తెలిపారు. 19న కల్యాణోత్సవం, పుష్పయాగంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. అలాగే నూతనంగా నిర్మించిన శ్రీ వ్యూహ లక్ష్మీ సమేత కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ కుంభాషేక వేడుకలను ఈనెల 16 తేదీ నుంచి 18 వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు మోహన్‌కృష్ణ శర్మ వెల్లడించారు.


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

నేడు డక్కిలిలో 'వై ఏపీ నీడ్స్ జగన్'

డక్కిలి : మండల కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ సీహెచ్ శ్రీనివాసులురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పెట్లూరు జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు.

చింతవరంలో..

చిల్లకూరు : మండలంలోని చింతవరంలో మంగళవారం వై ఏపీ నీడ్స్ జగన్ నిర్వహించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ యద్దల మధుసూదన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

బీజీకేపాళెంలో..

చిట్టమూరు : బురదగల్లికొత్తపాళెం గ్రామ సచివాలయంలో మంగళవారం ఏపీకి జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి సోమవారం తెలిపారు. సాయంత్రం 4గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని వెల్లడించారు.

నేడు మండల మీట్

డక్కిలి : ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ గోను రాజశేఖర్ సోమవారం తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు తప్పకుండా హజరు కావాలని కోరారు.

వెంకటగిరిలో 'గడప గడపకు'

వెంకటగిరిరూరల్ : పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో వెంకటగిరి నియోజకవర్గ పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నేదురుమల్లి కార్యాలయం తెలిపింది. ప్రజా సమస్యల పరిష్కారంతోపాటు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించే ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరింది.

అక్రమ తవ్వకాల అడ్డగింత

చిట్టమూరు: మండల పరిధిలోని యాకసిరి గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో జరుగుతున్న అక్రమ తెల్లరాయి తవ్వకాలను ఆదివారం రాత్రి అడ్డుకున్నట్లు ఎస్‌ఐ కె.గోపి సోమవారం తెలిపారు. అటవీ ప్రాంతంలో రాత్రి సమయాల్లో జేసీబీతో తెల్ల రాయిని తవ్వి టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని సమాచారం అందడంతో దాడులు చేసినట్టు తెలిపారు. జేసీబీ, టిప్పర్ స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు వెల్లడించారు.

వేగంగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్ : పట్టణంలో నిర్మిస్తున్న నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి షాపింగ్ కాంప్లెక్స్ పనులను వేగంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశించారు. సోమవారం ఈ మేరకు నిర్మాణ పనులను పరిశీలించారు. ఎన్‌జేఆర్ దుకాణ సముదాయం శిథిలావస్థకు చేరుకోవడంతో తొలగించి, పునర్నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. కింద భాగంలో మొత్తం 30 దుకాణాలను పూర్తిగా పడగొట్టి తిరిగి కాస్త పెద్దవిగా 29 షాపులు నిర్మిస్తున్నట్లు వివరించారు. అలాగే పై అంతస్తులో కూడా దుకాణాలు నిర్మిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు వివరించారు. త్వరలోనే అన్ని పనులు పూర్తి చేసి లీజు దార్లకు అప్పగించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఈక్రమంలోనే ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో నిర్మిస్తున్న అంబేడ్కర్ భవన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కె.మాధవ రెడ్డి, కె.రాజారెడ్డి, కె.జయరామయ్య, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, వి.లక్ష్మీనారాయణరెడ్డి, డి.రవి, పి.రాజేష్ , షేక్ షబ్బీర్, రమ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా పవిత్రాల సమర్పణ

చిట్టమూరు : మండలంలోని మల్లాం గ్రామంలో స్వయంభువుగా వెలసిని శ్రీవళ్లీదేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరుని పవిత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి శాస్త్రోక్తంగా పవిత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఉదయం ఆలయంలో గణపతి పూజ, విశేష సంధి , కలశాభిషేకం , పూర్ణాహుతి తదితర పూజలను అర్చకుడు మూలంరాజు భాణప్రకాష్ శర్మ నిర్వహించారు. అనంతరం స్వామి వారి మూల విరాట్‌కు అభిషేకం చేసి విశేషంగా అలంకరించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేపట్టారు. రాత్రి స్వామి, అమ్మవార్లకు కనుల పండువగా గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ చైర్మన్ చిల్లకూరు సాయికుమార్ రెడ్డి పర్యవేక్షించారు.


స్వామి వారికి పవిత్రాలు తీసుకువస్తున్న అర్చకులు

'అయ్యప్ప జ్యోతి' కరపత్రం విడుదల

సూళ్లూరుపేట : పట్టణంలోని షార్ బస్టాండ్ సెంటర్‌లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శ్రీఅయ్యన్ అయ్యప్పస్వామి వారి జ్యోతి ఉత్సవం కరపత్రాన్ని సోమవారం ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ మాట్లాడుతూ 24 ఏళ్లగా అయ్యప్ప జ్యోతి ఉత్సవం నిర్వహిస్తున్నామని, ఇది 25 ఏళ్ల సిల్వర్‌జూబ్లీ కావడంతో గ్రామోత్సవంతోపాటు, పడికట్ల పూజ, కర్పూరజ్యోతి వెలిగించే కార్యక్రమాన్ని డిసెంబర్ 8 నుంచి 10వ తేదీ వరకు మూడురోజులు పాటు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని వివరించింది. మంత్రి కాకాణి గోవర్దన్‌రెడ్డి చేతులు మీదుగా గ్రామోత్సవాన్ని ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. అఖండ కర్పూరజ్యోతి ప్రజ్వలనం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, చెంగాళమ్మ ఆలయ కమిటీ మాజీ చైర్మన్ వేనాటి రామచంద్రారెడ్డి చేతులు మీదుగా నిర్వహించనున్నట్లు తెలిపింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు కొల్లి లీలామోహన్‌రెడ్డి, పాదర్తి రవీంద్రారెడ్డి, ఏకే రాజగోపాల్, ఎల్.సాయి ప్రదీప్‌రెడ్డి, కె.చంద్రమౌళిరెడ్డి, వీ గురుస్వామిరెడ్డి, ఐ.సత్యనారాయణ, జీవీ సుబ్బారావు, వి.రమేష్, జీకే మణికంఠ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు పూరిల్లు దగ్ధం

డక్కిలి(బాలాయపల్లి): మండలంలోని కయ్యూరు పంచాయతీ, సుబ్రమణ్యం దళితవాడలో ప్రమాదశశాత్తుతో ఓ పూరింటికి నిప్పు అంటుకున్న సంఘటన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. బాధితుల కథనం.. దళితవాడకు చెందిన మేకల సుబ్బరాయులు కుటంబ సభ్యులు ఇంట్లో దేవుని పటాల వద్ద దీపం వెలిగించి, దీపావళి పండుగు సందర్భంగా సరదాగా ఆరు బయట ఉన్నారు. ఇంతలో ఇంట్లో వెలిగించిన దీపం పూరింటికి అంటుకుంది. ఇంట్లో ఉన్న చీరలు, బీరువాలోని నగదు కాలిబూడిదయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లినట్టు వాపోయారు. ఈ మేరకు ప్రమాద విషయాన్ని తహసీల్దార్ శ్రీనివాసులుకు తెలియజేసినట్టు తెలిపారు.

వృద్ధుడి ఆత్మహత్య

దొరవారిసత్రం: కొడుకు ఆత్మహత్యాయత్నాన్ని జీర్ణించుకోలేక ఓ వృద్ధుడు పురుగుల మందుతాగిన తనువు చాలించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ తిరుమలరావు కథనం.. శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, చేజర్ల మండలం, మైపాటివారికండ్రిగ గ్రామానికి చెందిన మాలపాటి తిరుపాల్‌రెడ్డి(62) కుమారుడు కిషోర్ చెన్నైలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. ఇటీవల అతన్ని ఉద్యోగం నుంచి తొలగించడంతో మనస్తాపానికి గురైన కిషోర్ పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తండ్రి తిరుపాల్‌రెడ్డి శనివారం చెన్నైకి వెళ్లి కుమారుడిని చూసుకుని తిరిగి ఆదివారం బస్సులో వస్తూ కుమారుడిని తలుచుకుని తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. మండలంలోని తల్లంపాడు గ్రామ సమీపంలో బస్సులోనే తిరుపాల్‌రెడ్డి పురుగుల మందు తాగేశాడు. తోటి ప్రయాణికులు మెరుగైన చికిత్సకోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించగా సోమవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.